పతంగుల సందడి..!







- మార్కెట్లో వివిధ రకాలు, ఆకృతుల్లో గాలిపటాలు
- కొనేందుకు ఆసక్తి చూపిస్తున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: సంక్రాంతి అంటే ముగ్గులు, గొబ్బిళ్లు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలే కాదు, వీటితో పాటు ముఖ్యమైంది పతంగులు. నింగిలో రంగురంగుల గాలిపటాల విన్యాసాలు పిల్లలతో పాటు పెద్దలనూ ఆనందంలో ముంచెత్తుతాయి. వీరి ఆసక్తికి తగినట్టే విభిన్న ఆకృతులతో... వింత వింత పతంగులు వివిధ రంగుల్లో, రూపాల్లో మార్కెట్లో సందడి చేస్తున్నాయి. కొనేందుకు చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆసక్తి చూపిస్తున్నారు. కార్టూన్ పాత్రలతో రూపొందించిన డోరెమాన్, బెన్‌టెన్, చోటా భీం, టామ్ అండ్ జెర్రీ, స్పైడర్‌మాన్, కార్టూన్ వంటివి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ, హ్యాపీ న్యూ ఇయర్, వివిధ రకాల పక్షులు, విమానం, సీతాకోక చిలుక, అటవీ జంతువులు, సినిమాలకు సంబంధించిన టైటిల్స్, హీరోల బొమ్మలతో ఇలా ఎన్నో రకాల పతంగులు.. కళాకారుల సృజనకు అద్దం పడుతున్నాయి.

నాణ్యతను బట్టి ధరలు

పతంగులు పరిమాణం, నాణ్యత, రంగులను బట్టి ధరలు ఉన్నాయి. ప్రత్యేకంగా వస్త్రాలతో తయారు చేసిన పతంగుల ధరలు రూ. 30నుంచి రూ.500ల వరకు ఉండగా, పేపర్, ప్లాస్టిక్‌తో చేసిన పతంగులు రూ. 5నుంచి మొదలుకుని రూ.100 వరకు లభ్యమవుతున్నాయి. వీటితో పాటు ప్రత్యేకంగా తయారు చేసిన మాంజా దారం మీటర్ల చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. చైనా మాంజాను దేశంలో నిషేదం విధించడంతో, స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన మోతీలాల్ మాంజా, బరెల్లి మాంజాలను మార్కెట్లో అమ్ముతున్నారు. ఈ మాంజా దారాలను గిట్లు(100 మీటర్లు) చొప్పిన అమ్ముతుండగా, గిట్ల ధర రూ. 10 నుంచి 50వరకు మాంజా నాణ్యతను బట్టి ఉంటుంది. పతంగులను ఎగిరేసేందుకు అవసరమైన చరక(దారం చుట్ట) రూ. 20 నుంచి రూ.200 వరకు ధరలు ఉన్నాయి.

విభిన్న రకాల్లో పతంగులు..

సీజనల్ పండుగల్లో వచ్చే సంక్రాంతికి పతంగుల గిరాకి బాగానే ఉంది. ఏటా అమ్మకాల పెరుగుదలతో పాటు, ఎన్నో రకాల పతంగులు, ప్రత్యేకమైనవి వస్తున్నాయి. ఈ ఏడాది విభిన్న రకాల పతంగులు రావడంతో, చిన్నారులు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– గుండ శ్రీను, వ్యాపారి, మంచిర్యాల

న్యూస్‌రీల్

స్పెల్‌విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో పోచయ్య

మంచిర్యాలఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టోరీ టెల్లింగ్‌లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని శివ నందిని మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. స్పెల్ విజార్డ్ పోటీల్లో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు సాయి మనీష్(ప్రథమ), అక్షిత(ద్వితీయ)స్థానం గెలుపొందారు. ప్రశ్నపత్రాలను ఎంఈవో పోచయ్య విడుదల చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా అల్లాడి శ్రీనివాస్, దత్తకుమార్, సుధారాణి వ్యవహరించారు. పోటీల కన్వీనర్లు సునితాదేవి, సాగర్, కావేరి సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రజిత, బారిక్‌రావు, మధుకర్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు విడుదల చేయాలి

నస్పూర్: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు శనివారం సీసీసీ లోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఈడీ వినోద్‌కుమార్‌కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఆవిర్భవించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా, ఇప్పటి వరకు బీసీ రుణాలు మంజూరు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రుణాలు మంజూరు చేసి బీసీ నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కో కన్వీనర్ సంగం లక్ష్మణ్, ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ జైపాల్ సింగ్, నాయకులు కంచర్ల కొమురయ్య, శీపతి రాములు, రాజేశం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం పదోతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించిన పరీక్షల్లో జిల్లాలోని 70పాఠశాలల నుంచి 150మంది విద్యార్థులు హాజరయ్యారు.పోటీల్లో తెలుగు మీడియంలో కేజీబీవీ బెల్లంపల్లికి చెందిన లక్ష్మి(ప్రథమ), కేజీబీవీ బెల్లంపల్లి మానస(ద్వితీయ), కేజీబీవీ కోటపల్లి–విజయరాణి (తృతీయ), ఇంగ్లిష్ మీడియంలో జెడ్పీఎస్ఎస్ వెల్గనూర్–హర్షిత (ప్రథమ), వెల్లనూర్ జెడ్పీఎస్ఎస్–మౌనిక (ద్వితీయ), జెడ్పీఎస్ఎస్ పొన్నారంకు చెందిన విద్యార్థి రష్మీత (తృతీయ) స్థానంలో నిలిచారు.కార్యక్రమంలో ఎంఈవో పోచయ్య,ఉపాధ్యాయుడు మనోహర్, సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్షుడు టంకశాల నరేందర్ రావు, ప్రధాన కార్యదర్శి ఇప్పలపల్లి మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ సృజన రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. పీఆర్ ఏఈ రాంచందర్, వ్యవసాయాధికారి శ్రీకాంత్, ఏపీఎం విజయలక్ష్మి, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి వారి పరిధిలోని అంశాలను వివరించారు. గొల్లగట్టు గ్రామ పరిధిలో విద్యుత్ లైన్ సరిగా లేదని విద్యుత్ లైన్ సరిచేయాలని ఎంపీటీసీ భారతి పేర్కొనగా, గ్రామాలకు రోడ్లు ఉన్నప్పటికీ బస్సు రావడంలేదని, బస్సు సౌకర్యం కల్పించాలని సభ్యులు కోరారు. అనంతరం బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తాను శాలువాలతో సన్మానించారు. జెడ్పీటీసీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీవో సతీష్, ఎంపీటీసీలు భారతి, లత శ్రీ, వరప్రసాద్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రిలే నిరాహార దీక్ష



పాతమంచిర్యాల: జిల్లాలోని పాతమంచిర్యాల రంగపేట శివారులోగల శాలివాహన గ్రీన్‌ఎనర్జి పవర్‌ప్లాంట్ పవర్ పర్చేస్ అగ్రిమెంట్‌ను పది సంవత్సరాల పాటు కొనసాగించాలని పవర్ ప్లాంట్ కార్మికులు నాలుగు రోజులుగా చేస్తున్న ధర్నా చేస్తుండగా, శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్లాంట్‌లో పీపీఏ అగ్రిమెంట్ ముగిసిందని, పరిశ్రమ యాజమాన్యం ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసిందని దీంతో కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. కంపెనీ పై ఆధారపడి బతుకుతున్న కార్మికులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్, ఐఆర్‌సీపీ, బీఎంఎస్, సీఐటీయూ, సీపీఎం, తెలంగాణ బీసీ జాగృతి సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు.

‘జీవ వైద్య వ్యర్థాలు నిర్లక్ష్యంగా పడేయొద్దు’


మాట్లాడుతున్న హరీశ్

బెల్లంపల్లి: జీవ వైద్య వ్యర్థాలను ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేయొద్దని సింగరేణి పర్యావరణ అధికారి అడ్లూరి హరీశ్ అన్నారు. తాండూర్ మండలం మాదారం సింగరేణి డిస్పెన్సరీలో శనివారం జీవ వైద్య వ్యర్థాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలో భాగంగా ఏర్పడే పలు రకాల మెడికల్, జీవ వైద్య వ్యర్థాలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యర్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. జీవ వైద్య వ్యర్థాలను వేరు చేయాలన్నారు. లేకపోతే అనేక పరిణామాలకు గురికావాల్సి వస్తుందని వివరించారు. వైద్యురాలు శ్రీలత మాట్లాడుతూ.. రోగి లేదా చికిత్స కోసం వినియోగించిన పరికరాలు, వెలువడిన జీవ వైద్య వ్యర్థాలను విభాగాల వారీగా, ఏ తీరుగా వేరు చేయాలో వివరించారు. ఏ రంగు డబ్బాలో ఏ వైద్య వ్యర్థం వేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. పర్యావరణ పరిరక్షణ, జీవుల మనుగడలో భాగంగా వ్యర్థాల నిర్వహణ ప్రాముఖ్యాన్ని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ స్టాఫ్ నర్సు అరుణసుందరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

పదోన్నతుల కోసం పరీక్షలు



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పదోన్నతుల కోసం శనివారం పరీక్షలు నిర్వహించారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో హెడ్ చైన్‌మెన్, చైన్‌మెన్, ఎంవీటీసీలో లాంపు రూం ఫిట్టర్, శాంపిల్ మజ్దూర్, కార్పెంటర్, రామకృష్ణాపూర్ రీజియన్ ల్యాబ్‌లో కోల్ ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహించారు. ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ఎస్వో టూ జీఎం, కృష్ణారావు, ఐఈడీ రాజన్న, ఏఎస్‌వో ఓదెలు, హెచ్‌వోడీ శ్యాంసుందర్, ఓఎస్ రాజలింగు, అధికారులు సత్యబోస్, ప్రదీప్‌కుమార్, ఉజ్వల్ బందోపాధ్య, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

సీఎంఓఏఐ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఏవీ రెడ్డి

శ్రీరాంపూర్: కోల్‌మైన్స్ ఆఫీసర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) సీనియర్ ఉపాధ్యక్ష పదవికి నాగపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఎన్నికలు నిర్వహించగా సింగరేణి నుంచి ఆర్కే 5గ్రూప్ ఏజెంట్‌గా పని చేస్తున్న ఏవీ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆర్కే 5గనిపై గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, ఇతర అధికారులు ఏవీ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, గ్రూప్ ఇంజనీర్ వీరన్న, ఫిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, ఇంజనీర్ సందీప్, అండర్ మేనేజర్లు ఎల్లయ్య, వినయ్‌రెడ్డి, అధికారులు సంఘం సింగరేణి విభాగం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘సంఘాల ఐక్యతతోనే సాధ్యమైంది’


మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎమ్మెస్, హెచ్చెమ్మెస్‌తోనే కోలిండియాలోని 11వ వేజ్‌బోర్డ్ చర్చల్లో మెరుగైన వేతన ఒప్పందం సాధ్యమైందని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏరియాలోని కేకే–1 గని ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, ప్రభాకర్, తిరుపతి, భానయ్య, శర్మ, మల్లయ్య, దినేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ

రామకృష్ణాపూర్: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పార్టీ చెన్నూర్ నియోజకవర్గ పాలక్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. గద్దెరాగిడిలోని భీమా గార్డెన్స్‌లో శనివారం పార్టీ చెన్నూర్ నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా మాట్లాడుతూ బూత్ స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ నాయకులు మహంకాళి శ్రీనివాస్, అక్కల రమేష్, శివరాజ్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దీక్షితులు, అందుగుల శ్రీనివాస్, పత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వర్చువల్ సమావేశంలో పాల్గొన్న శోభ, నాయకులు

‘బీఆర్‌ఎస్‌ను సాగనంపడానికి సంసిద్ధులు కావాలి’

బెల్లంపల్లి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడానికి శ్రేణులు సంసిద్ధులు కావాలని బీజేపీ వక్తలు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సంతోష్ అధ్యక్షతన బూత్‌స్థాయి కమిటీ సభ్యుల మహాసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ కౌశిక్ హరి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకుడు ఏమాజీ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జర్నలిస్టులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 8–10తేదీల్లో జరిగే టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభ పోస్టర్లను శనివారం ఏఎంసీ మైదానంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర అనిర్వచనీయమన్నారు. అందుకే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100కోట్ల సంక్షేమ నిధిని కేటాయించారని గుర్తుచేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్లు బొడ్డు నారాయణ, అఫ్సర్, నీలి కృష్ణ, శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బీఆర్‌ఎస్, టీయూడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: టీయూడబ్ల్యూజే మహాసభల సమావేశం పోస్టర్‌ను మండలంలోని జర్నలిస్టులు శనివారం స్థానిక ఐబీ ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ చాతరాజు రాజన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రవేశ గడువు పెంపు

దండేపల్లి: ఓపెన్ టెన్త్‌లో 2022–23 విద్యా సంవత్సరానికి గాను ప్రత్యేక ప్రవేశాల కోసం ఈ నెల 9నుంచి 13లోగా దరఖాస్తు చేసుకోవచ్చని, దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వరలక్ష్మి, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 8309769067 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నర్సరీ పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని పోలంపల్లిలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీని శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. మొక్కలను నీటిని అందించి సంరక్షించాని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఎంపీవో సతీశ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనం

చెన్నూర్‌రూరల్: మండంలోని సుబ్బరాంపల్లిలో శనివారం బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ మంత్రి బాపు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఫణీందర్‌రావు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీని శనివారం నూతన ఇన్‌చార్జి డీపీవో ఫణీందర్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్యం, మొక్కలు పెంచడం, పంచాయతీ కార్యాలయంలోని మినరల్‌వాటర్‌ప్లాంట్ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల కృష్ణ, ఎంపీవో నాగరాజు, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, నాయకులు బన్న శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

వయోజన విద్య వలంటీర్లకు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: స్థానిక అండాళమ్మకాలనీలో జిల్లా వయోజన విద్యశాఖ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వయోజన విద్య వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వయోజనవిద్య శాఖ ఇన్‌చార్జి అధికారి పురుషోత్తంనాయక్ మాట్లాడుతూ మహిళలకు కుట్టుశిక్షణతో పాటు నిరక్షరాస్య మహిళలు, పురుషులకు విద్యను నేర్పించటం కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, శాంకరి, అశోక్‌రావు, కుట్టుశిక్షణ కేంద్ర నిర్వాహకురాలు, అంగన్‌వాడీ టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి లైఫ్‌కోచ్ అండ్ ట్రైనర్ వేణుకళ్యాణ్ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టీచింగ్‌లో మార్పులు తీసుకురావటంతో పాటు టీచింగ్ నైపుణ్యాల పెంపునకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెభూమేష్, ట్రస్మా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘భూ మాఫియాపై చర్యలు తీసుకోవాలి’

కాసిపేట: బెల్లంపల్లి మండలంలోని సోమగూడం రహదారిని ఆనుకొని ఉన్న భూముల విషయంలో ఇతర ప్రాంతాలకు చెందిన భూ మాఫియా గొడవలు సృష్టిస్తోందని, వారిపై చర్యలు తీసుకోవాలని కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గంగారాంకు సర్పంచ్ ప్రమీలగౌడ్ శనివారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో నైపుణ్యం రెట్టింపు’

జన్నారం: విద్యార్థుల్లో పోటీ పరీక్షలతో నైపుణ్యం రెట్టింపవుతుందని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జాడి మురళి పేర్కొన్నారు. మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్పెల్ విజార్డ్‌లో కోట అద్వైత్, అల్లాపు అదీప్, స్టోరీ టెల్లింగ్ కాంపిటేషన్‌లో రఘుపతి, రమ్య ప్రతిభ చూపగా వారికి బహుమతులు అందజేశారు.

పుస్తకాల వితరణ

బెల్లంపల్లి: స్థానిక తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల లైబ్రరీకి మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న బొమ్మెర రాజమౌళి రూ.10వేలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సీఓఈ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందజేశారు.

టీయూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

జైపూర్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) మండల నూతన కమిటీని ఎన్నుకోగా, అధ్యక్షుడిగా వేదాంతం విశ్వప్రసాద్ ఎన్నికయ్యారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని కేతన్‌పల్లిలో జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్ సహకారంతో సర్పంచ్ ఆవులమర్రి దుర్గక్క ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. పోటీల్లో వేమనపల్లి, కోటపల్లి మండలాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొన్నాయి.

అవగాహన

జైపూర్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జైపూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివరం విద్యార్థులకు డయల్ 100, షీ టీమ్స్, గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలు అంశాలను ఎస్సై రామకృష్ణ విద్యార్థులకు వివరించారు.

‘ఎఫ్ఐఆర్ ప్రతిని ఎస్సై ఇవ్వడం లేదు’

బెల్లంపల్లి: తమపై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ప్రతిని ఇవ్వకుండా తాండూర్ ఎస్సై సతాయిస్తున్నారని హైదరాబాద్‌కు చెందిన ఆరిజిన్ డైరి మేనేజింగ్ పార్టనర్ బోడపాటి షేజల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై తాండూర్ ఎస్సై సమ్మయ్యను ‘సాక్షి’ వివరణ కోరగా హైదరాబాద్‌కు చెందిన ఆరిజిన్ డైరి మేనేజింగ్ పార్టనర్ షేజల్, తాండూర్ వాసి చౌటపల్లి రంగారావు గత నెల పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని, ఇరు వర్గాలపై గతనెలలో పిటీ కేసు పెట్టి కోర్టుకు పంపామన్నారు. కోర్టు నుంచి పర్మిషన్ రాగానే చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని తెలిపారు.

ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత



బెల్లంపల్లి: ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత అలవడుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శనివారం బెల్లంపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో ఏఎంసీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే చిన్నయ్య, ఆయన సతీమణి జయతార, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ముగ్గుల పోటీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మున్సిపాలిటీలోని 34వార్డుల నుంచి మహిళలు హాజరై పోటీల్లో అందమైన రంగవల్లులు వేసి అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జయతార, ఏడీఏ సురేఖ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఐకేపీ మెప్మా ఆర్పీలు, గ్రూపు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వధువు వివాహ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, సంస్మరణ, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7331119940
చెన్నూర్: శ్రీను - 8309865990
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899